ట్రాక్టర్లే యమకింకరులు



పోలీసులు సీజ్ చేసిన రెడ్ స్టిక్కర్లు లేని ట్రాక్టర్లు

- ట్రాలీకి రేడియం స్టిక్కర్లు లేకనే హైవేలో
- వెనక వచ్చే వాహనాలకు కానరాని ట్రాక్టర్లు
- జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని యజమానులు

పలమనేరు: ఇటీవల బైరెడ్డిపల్లి మండలం చంద్రమాకులగడ్డకు చెందిన ఓ యువకుడు పెద్దపంజాణి మండలంలోని అత్తారింటికి బైక్‌పై వెళుతుండగా పేడదిబ్బ ఎరువుతో వెళుతున్న ట్రాక్టర్‌కు ఎలాంటి లైట్లు, రేడియం స్టిక్కర్లు లేకుండా వెళుతుండగా దాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడి ఆపై చికిత్స పొందుతూ కుప్పం పీఈఎస్‌లో మృతిచెందాడు. ముందువెళుతున్న ట్రాక్టర్‌కు కనీసం రెడ్‌లైట్, స్టిక్కర్ కూడా లేకపోవడం కారణంగా గత మూడేళ్లలో పదిదాకా ప్రమాదాలు జరగ్గా ఇందులో ఆరుగురు మృత్యువాత పడగా, పలువురు గాయపడ్డారు. తాజాగా క్యాటిల్‌ఫామ్‌కు రాంగ్‌రూట్‌లో వెళుతున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొని అసోం రాష్ట్రానికి చెందిన దంపతులు తీవ్రంగా గాయపడి వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నారు.



హైవేలో రేడియం స్టిక్కర్ లేకుండా వెళుతున్న ట్రాక్టర్

ట్రాక్టర్ నిర్వాహకుల నిర్లక్ష్యం

ఇటీవల చెన్నై- బెంగళూరు, అనంతపూర్- క్రిష్ణగిరి హైవేలో రాత్రిపూట రోడ్డుపై వెళ్లే కనిపించని ట్రాక్టర్ల కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పేడదిబ్బలను తరలించే ట్రాక్టర్లు భారీగా పెరిగాయి. ఇవి నియోజకవర్గంతో పాటు పలు దూర ప్రాంతాలకు దిబ్బలను తరలిస్తున్నాయి. అయితే ఈ ట్రాక్టర్ ట్రాలీలకు వెనుకవైపు రెడ్‌లైట్లు, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో వెనకాల వచ్చే వాహనాలకు ముందు వెళుతున్న ట్రాక్టర్ కనిపించక దాన్ని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు.

డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణం



ఈ ప్రాంతంలో దిబ్బఎరువు, ఇసుకను అక్రమంగా తరలించే ట్రాక్టర్లు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటి ట్రాలీలకు వెనుక రేడియం స్టిక్కర్లుగానీ, రెడ్‌లైట్లుగానీ ఉండవు. రాత్రులో ముందువెళ్లే ట్రాక్టర్ అసలు కనిపించదు. దీంతో వెనుక నుంచి వెళ్లే వాహనాలు వీటిని ఢీకొని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా ట్రాక్టర్ యజమానుల నిర్లక్ష్యం, డ్రైవర్ల ర్యాష్ డ్రైవింగే పలు ప్రమాదాలకు కారణమవుతోంది.

–రవి, కూర్మాయి, పలమనేరు మండలం

భారీ జరిమానాలు తప్పవు



రవాణాశాఖ, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో హైవేలపై వెళ్లే ట్రాక్టర్ల డ్రైవర్లకు అవగాహన కల్పించాం. రేడియం స్టిక్కర్లను స్వయంగా అంటించాం. కానీ కొందరు ట్రాక్టర్ యజమానులు రేడియం స్టిక్కర్లపై నిర్లక్ష్యం చూపుతున్నారు. ప్రస్తుతం పేడ దిబ్బలను తరలించే ట్రాక్టర్లు, ఇసుకను తరలించే ట్రాక్టర్ల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాహనాలను సీజ్ చేయడమే కాదు భారీ జరిమానాలు విధిస్తాం.

–మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ వితరణ

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వీఆర్‌ఆర్ కళాశాల డిగ్రీ విద్యార్థులకు జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు లయన్ మహ్మద్‌అలీ లాసెట్, ఐసెట్ (స్టడీ మెటీరియల్) పుస్తకాలను వితరణగా అందజేశారు. విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడతాయన్నారు.

లీకేజీలు అరికట్టండి



గానుగచింత దాసరి గూడెంలో లీక్ అవుతున్న తాగునీటి పైపు

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత దాసరి గూడెంలో తాగునీటి పైపు లీకేజీలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. గానుగచింత ఉన్నత పాఠశాల పక్కన తాగునీటి పైపులైన్ దెబ్బతింది. దీంతో పంచాయతీ అధికారులు మరమ్మతులు చేశారు. అయితే పైపునకు లీకేజీ పడిందని నీరు అక్కడే వృథాగా పోతుందని తెలిపారు. అక్కడ తాగునీటిలో మురుగు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందన్నారు. వెంటనే తాగునీటి పైపు లీకేజీలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రొంపిచెర్ల మండల సమావేశం రేపు

రొంపిచెర్ల: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు



పరుగులు తీస్తున్న పశువులు

గుడుపల్లె: మండలంలోని అగరం, కొత్తపల్లిలో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా పశువులకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పశువులను గ్రామంలో హద్దులు ఏర్పాటు చేసి పశువులను పరుగులు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువత పోటీపడ్డారు. వేడుకను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం తరలి వచ్చారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



బైరెడ్డిపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్‌రావు

బైరెడ్డిపల్లి: గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) షెడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ చేసి వర్మికంపోస్టును తయారు చేయాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం బైరెడ్డిపల్లె సచివాలయంలో రికార్డులు పరిశీలించి కమ్మనపల్లె, బైరెడ్డిపల్లెలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఈఓపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను అనాథలు చేయకండి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ సుప్రియ

పుంగనూరు: మితిమీరిన వేగంతో వాహనాల్లో వెళ్లి ప్రమాదాలకు గురై మృత్యువాత పడి కుటుంబ సభ్యులను అనాథలు చేయకండి అంటూ విద్యార్థులు భద్రతా వారోత్సవాల్లో నినాదాలు చేసి చైతన్యపరిచారు. గురువారం ఎంవీఐ సుప్రియ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను పట్టణంలోని కళాశాల, హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.



పక్షుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

విద్యార్థుల క్షేత్ర పర్యటన

పులిచెర్ల(కల్లూరు): తిరుపతి జిల్లాలోని నేలపట్టు, పులికాట్ పక్షుల సంరక్షణ కేంద్రాలను గురువారం కల్లూరు హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా 50 మంది విద్యార్థులు గైడు వెంకట సిద్ధులు ఆధ్వర్యంలో సందర్శించారు. అనంతరం శ్రీహరి కోట రాకెట్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్ర, వేణుగోపాల్, రహమత్, సుభాషిణి, రేణుక పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత కృషితో కల్వర్టు నిర్మాణం

పుంగనూరు: పట్టణ బస్టాండ్ నుంచి తాటిమాకుల పాళెంకు వెళ్లే కల్వర్టు కూలిపోయి ఉండటంతో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గంగారపు జయరాం గురువారం నూతన కల్వర్టు నిర్మించారు. కల్వర్టు కూలి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో జయరాం తన సొంత నిధులు రూ.30 వేలు వెచ్చించి నూతన కల్వర్టును నిర్మించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టడంపై పట్టణ ప్రజలు అభినందించారు.



తాటిమాకులపాళెం రోడ్డులో వేసిన కల్వర్టు

జాగ్రత్తలు పాటించాలి

పలమనేరు: మామిడిపూత సక్రమంగా పట్టేందుకు, పిందె దశలో రైతులు తాము సూచించిన జాగ్రత్తలను పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆమేరకు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం మామిడిపై అవగాహన కార్యక్రమం ఆయన అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ తోటలో పూత మొత్తం ఒకే దఫా వచ్చేందుకు పోటాషియం నైట్రేట్‌ను పది గ్రాముల అర్కామ్యాంగో స్పెషల్‌తో పిచికారీ చేయాలన్నారు. మొగ్గ దశలో క్లోరోపైరిపాస్‌ను పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా తెల్లపూత దశలో ఎలాంటి మందులను పిచికారీ చేయరాదన్నారు. ఈ సందర్భంగా మామిడిపై అవగాహన కల్పించే కరపత్రాలను రైతులకు పంపిణీ చేయాలన్నారు. స్థానిక ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి

అన్నింటా మహిళలు ముందంజ

పలమనేరు: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళుతున్నారని బెంగళూరు ఏకానమిక్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేశవ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక విభాగం ఆధ్వర్యంలో మహిళా సాధికారిత అంశంపై గురువారం సెమినార్ జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డా. వెంకటేశులు మాట్లాడుతూ నేటి పురుషాధిక్య సమాజంలో మహిళలు ఎందులోనూ తీసిపోవడం లేదన్నారు. మద్రాసు యూనివర్సిటీ నుంచి విచ్చేసిన అధ్యాపకులు సునీలా శ్యామ్ మాట్లాడుతూ నేటి విద్యార్థినులు చదువుతోపాటు మహిళా సాధికారిత సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాదు యూనివర్సిటీ నుంచి వచ్చిన రాధ మాట్లాడుతూ మహిళలు పురోగతిని సాధిస్తేనే ఆ కుటుంబం, దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉంటుందన్నారు. మూడు రాష్ట్రాల్లోని పలు విశ్వవిద్యాలయాల నుంచి విచ్చేసిన ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు, వివిధ కళాశాలల విద్యార్థినులు, స్థానిక కళాశాల అధ్యాపకులు పాల్గొనగా ఇందుకు కో–ఆర్డినేటర్‌గా కళాశాలకు చెందిన ఆర్థిక శాఖాధ్యక్షులు రుక్మిణిగారు వ్యవహరించారు.



సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

పలమనేరు: పట్టణంలోని ఏటీఎం సర్కిల్ వద్ద సుభాష్ చంద్రబోస్ జయంతి 128 వేడుకలను స్థానిక వీహెచ్‌పీ, గోవింద దివ్యధామం సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు.

మార్చి 8న లోక్ అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో మార్చి 8న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫాషేక్ తెలిపారు. గురువారం అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కృష్ణవంశీతో కలసి న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో అనువైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీపీ వీరాంజనేయులు, ప్రభుత్వ న్యాయవాదులు హరినాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చెన్నకేశవులు పాల్గొన్నారు.

పైనేని మునెమ్మ స్మారక కథల పోటీ

పలమనేరు: పైనేని మునెమ్మ జాతీయస్థాయి స్మారక కథల పోటీలను స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఆ సమితి నిర్వాహకులు తులసీనాథంనాయుడు గురువారం ఈ ప్రకటనలో తెలిపారు. కుటుంబ సమస్యలను ఇతివృత్తంగా చేసుకొని రాసిన కథలను వచ్చేనెల 20లోపు కళామందిరం, గంగవరం, పలమనేరు చిరునామాకు పంపాలని తెలిపారు. ఇందులో తొలి బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.1000 ఇవ్వనున్నట్లు అందులో తెలిపారు. వివరాల కోసం 9553429770 అనే నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జరిమానాలు వెంటనే చెల్లించాలి



పరుశురాముడు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాదిలో వాహనాలు తనిఖీ నిర్వహించి జరిమానాలు విధించామని, చెల్లించని వాహనదారులు వెంటనే సచివాలయాల్లో గానీ, మీసేవా కేంద్రాల్లో గానీ చెల్లించాలని ఎస్‌ఐ పరుశురాముడు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వాహనదారులు సరైన రికార్డులు, లైసెన్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. జరిమానాలు విధిస్తే అప్పటికప్పుడే చెల్లించాలన్నారు. జరిమానాలు చెల్లించని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

మండల సమావేశంలో అధికారుల నిలదీత

సదుం: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి హామీ పథకంలో పనులు చేపడితే కోర్టును ఆశ్రయిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ధనుంజయరెడ్డి అధ్యక్షతన గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంతకాలు లేకుండానే మస్టర్లు ఎలా తయారు చేస్తున్నారని నిలదీశారు. బూరగమంద పంచాయతీ పరిధిలో ఏడుగురు రైతులకు ఉద్యానవన శాఖలో ఉపాధి నుంచి అందాల్సిన బిల్లులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకు రాలేదని ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు మోటార్లు మంజూరు చేయాలని రెడ్డివారిపల్లె సర్పంచ్ హనుమంతరెడ్డి కోరారు. పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మొరవపల్లె పంచాయతీ పరిధిలో ఇటీవల మూడు ఆవులు చనిపోయాయని సర్పంచ్ జగన్నాథం ఆరోపించారు. ఆర్‌బీకేల పరిధిలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కొందరు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇకపై అలాజరగకుండా చూస్తామని ఏఓ మాధవి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అమరావతి, ఎంఈఓ దామోదర, డాక్టర్ చరణ్, ఏపీఓ శ్రీనివాసులు, ఏఈ చంద్రశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్

ఆరోగ్యానికి ముప్పు

ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించినా క్షేత్రస్థాయిలో మాత్రం తగ్గడం లేదు. ఎటుచూసినా ప్లాస్టిక్ కవర్ల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నివారించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం నిత్యావసర వస్తువుగా మారింది. నగరాలు, పట్టణాలు, పల్లెల్లోనూ ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. దీంతో ఆరోగ్యం, పర్యావరణానికి ముప్పు అని తెలిసినా చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



పట్టణంలో వాడి పారేసిన ప్లాస్టిక్ కవర్లు

- అమలుకాని ప్లాస్టిక్ నిషేధం
- విచ్చల విడిగా వినియోగం
- పట్టించుకోని అధికారులు

వి.కోట: మండలంలో మూడు రాష్ట్రాల కూడలి కావడంతో ఈ ప్రాంతంలో వ్యాపారాలకు ప్రసిద్ధి. దీంతో వేల మంది క్రయ విక్రయాలు జరుపుతుంటారు. ముఖ్యంగా ఇలాంటి ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు చొరవ చూపాల్సి ఉంది. ప్లాస్టిక్ వినియోగంతో మూగజీవాలు, మానవ మనుగడకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ ముప్పు ఉందని వైద్యులు చెబుతున్నా ప్రజలు కవర్లు వినియోగించడం మాత్రం మానడం లేదు. భూమి, నీరు, వాయు కాలుష్యానికి ప్లాస్టిక్ కవర్ల వినియోగం ప్రధాన కారణంగా మారుతోంది. అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇటీవల కాలంలో ప్లాస్టిక్ కవర్లకు బదులు క్లాత్ బ్యాగులు వచ్చాయి. అయినా వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా 40 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన కవర్లు, టీ కప్పులు, గ్లాసులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.

మూగజీవుల ప్రాణాలు హరిస్తున్నా..

ప్రజలు విచ్చలవిడిగా వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లను జంతువులు ఆహారంగా తీసుకుంటున్నాయి. ప్లాస్టిక్ జీర్ణం అయ్యే పరిస్థితి లేక జీర్ణకోశ వ్యాధుల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి.

పేరుకుపోతున్న వ్యర్థాలు

వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో పేరుకుపోయి భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. ప్లాస్టిక్ భూమిలో త్వరగా కలిసిపోదు. కొన్నివందల ఏళ్లు అలాగే ఉంటుంది. దీంతో పంటలకు కూడా ముప్పు కలుగుతుంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి



అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు తీసుకోకపోవడంతో మండలంలో విచ్చలవిడిగా కవర్లను వాడుతున్నారు. పొలాల్లో ప్లాస్టిక్ కరగకపోవడంతో పంటలు సరైన దిగుబడులు రావడంలేదు. పశువులు వీటిని ఆహారంగా తీసుకుని మృతి చెందుతున్నాయి.

–దేవరాజ్, రైతు, ఆదినేపల్లి, వి.కోట

అవగాహన అవసరం



ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలి. నిత్యం ప్రజలు ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారు. కాఫీ, టీ, టిఫిన్లు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులనే వాడుతున్నారు. వేడితో కలసిన పదార్థాలు ప్లాస్టిక్ వస్తువుల ద్వారా తీసుకుంటే తొందరగా క్యాన్సర్ సంభవించే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ ప్రజలకు కొని తెచ్చుకున్న ప్రమాదంలా మారుతుంది. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

–డాక్టర్ రాజేష్‌నాయక్, వైద్యాధికారి, ఓగు పీహెచ్‌సీ, వి.కోట

కోలాహలం.. కనుమ పండుగ

మండలంలోని అమ్మరాజుపల్లి, రాజుపల్లి, పెద్దవెలగటూరు గ్రామాల్లో గురువారం కనుమ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు ఆకర్షణీయంగా రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలను పెట్టి పూజలు చేశారు. ఎద్దులు, పాడి పశువులను ప్రత్యేకంగా అలంకరించారు. బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాలతో గ్రామ పొలిమేరలోని కాటమరాజు గుడి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి, పశువులు వృద్ధి చెందాలని కోరుతూ పూజలు చేశారు. తదుపరి చిట్లాకుప్పకు నిప్పుపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బంధువులు, స్నేహితులు రాకతో గ్రామాలు కిటకిటలాడాయి.

-పెద్దపంజాణి



అమ్మరాజుపల్లిలో ప్రత్యేక అలంకరణలో పశువు

రంకెలేసిన కోడెగిత్తలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో పశువుల పండగ ఘనంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా రెడ్డి వీధి నుంచి దేవర ఎద్దులను అలంకరించి పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా దిగువవీధి గంగమ్మ ఆలయానికి తీసుకెళ్లారు. దేవర ఎద్దులకు పూజలు నిర్వహించిన అనంతరం పరుగులు పెట్టించారు. ఎద్దులను నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. ఎద్దులకు కట్టిన లుంగీలను చేజిక్కించుకోవడానికి యువకులు ఉత్సాహం కనబరిచారు.

-రామకుప్పం



ఎద్దుల పండగను తిలకించడానికి వచ్చిన జనం

జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు వచ్చాయని ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. వ్యవసాయ సర్వీసులకు వినియోగించే 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు 300, అలాగే కరెంటు స్తంభాలకు వాడే క్రాస్‌హారాలు 1500 చేరాయన్నారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరియల్స్ డ్రా చేసుకోవాలన్నారు.